క్లుప్తంగా

సమన్వయంతో భక్తులకు సేవలందించాలి



అన్నప్రసాద వితరణ భవనం వద్ద అధికారులకు పలు సూచనలు చేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రావణ మాసంలో భక్తులకు సమన్వయంతో సేవలందించాలని దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు అధికారులకు సూచించారు. సోమవారం ఆయన క్యూలైన్లు, ఉచిత అన్నప్రసాద వితరణ, లడ్డూ ప్రసాదాల విక్రయకేంద్రాలు, అన్నప్రసాద వితరణ మొదలైన వాటిని పరిశీలించారు. భక్తులకు దర్శన ఏర్పాట్ల సమాచారాన్ని దేవస్థానం ప్రసార వ్యవస్థ ద్వారా తెలియజేయాలని సూచించారు. క్యూలైన్లలో వేచిఉండే భక్తులకు నిరంతరం తాగునీరు, బిస్కెట్లు, అల్పాహారం అందించాలన్నారు. దర్శన క్యూకాంప్లెక్స్, లడ్డూప్రసాదాల విక్రయ కేంద్రాలు తదితర చోట్ల తొక్కిసలాట జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్నప్రసాద వితరణలో ప్రతి వంటకం ప్రతిభక్తుడికి అందేలా చూడాలన్నారు. స్థానిక పోలీసుల సహకారంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అన్నప్రసాద వితరణకు రూ.లక్ష విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం గుంటూరుకు చెందిన ఒంటెద్దు చిన్న బాపిరెడ్డి రూ.1,00,116 విరాళాన్ని ఆలయ క్యూలైన్ల పర్యవేక్షణ ఏఈఓ ఐఎన్వీ మోహన్‌కు అందజేశారు. దాతను దేవస్థానం తరఫున స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు.

మల్లన్న సన్నిధిలో తెలంగాణ మంత్రి



దర్శనానికి వెళ్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

శ్రీశైలంటెంపుల్: తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులకు రాజగోపురం వద్ద అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి దంపతులు మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించుకున్నారు. అమ్మ వారి ఆలయం వద్ద ఆశీర్వచన మండపంలో మంత్రి దంపతులకు వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. అధికారులు స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసా దాలను అందించి సత్కరించారు. అనంతరం భ్రమరాంబాదేవి అతిథిగృహం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ..అటవీశాఖ నుంచి అనుమతులు తీసుకుని భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రతిరోజు రాత్రి 10 గంటలకు హైదరాబాద్ నుంచి శ్రీశైలానికి, శ్రీశైలం నుంచి హైదరాబాద్‌కు ఏసీబస్సుసర్వీసునుత్వరలోప్రారంభిస్తామన్నారు.

పల్లకోత్సవం

మహానంది: మహానందిలో సోమవారం రాత్రి మహానందీశ్వర దంపతులకు ఈఓ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవాన్ని కనుల పండువగా చేపట్టారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం

నందికొట్కూరు/పగిడ్యాల/జూపాడుబంగ్లా/కొత్తపల్లి: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు సూచించారు. సోమవారం నందికొట్కూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా, కొత్తపల్లి మండల్లాలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని సూచించారు.

కూటమి ప్రభుత్వంలో విద్యారంగం తిరోగమనం

- ప్రభుత్వ పాఠశాలల్లో తిష్టవేసిన సమస్యలు
- ఉపాధ్యాయుల కొరతతో నష్టపోతున్న విద్యార్థులు
- మధ్యాహ్న భోజనంలోనూ నాణ్యతకు తిలోదకాలు

సర్కారు బడి.. నిన్నటి వరకు అదో గారాల అమ్మ ఒడి. నేడు ఆ అమ్మ ఒడి పిల్లల కష్టాలతో బరువెక్కింది. అరకొర విద్యా కానుకలు.. రుచిశుచి లేని భోజనాలు.. ఏకోపాధ్యాయుల బోధనలు వంటి సమస్యలతో బడి కళ తప్పింది. అమ్మఒడి ఇవ్వకుండా కష్టాల సుడిగుండంలో పడేసిన టీడీపీ సర్కారు కనీస కోరికలు తీర్చలేని స్థితిలో ఉండిపోయింది. శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో ప్రభుత్వం చదువులను చక్కబెట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై 'సాక్షి' విజిట్ చేయగా పలు సమస్యలు వెలుగు చూశాయి. - ఆత్మకూరు/నందికొట్కూరు

మొక్కుబడి



పగిడ్యాల జెడ్పీ స్కూల్‌లో ఆరుబయటే భోజనం చేస్తున్న విద్యార్థులు



నిరుపయోగంగా ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్ మిషన్

శ్రీశైలం నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో విద్యాబోధన అస్తవ్యస్తంగా మారింది. నియోజకవర్గంలోని ఆత్మకూరు, బండిఆత్మకూరు, వెలుగోడు, మహానంది మండలాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీటిక సౌకర్యాలు కూడా సరిగా లేవు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఇళ్ల నుంచే వాటర్ బాటిళ్లను ఇంటి నుంచే తెచ్చుకుంటున్నారు. ఈ బాటిళ్ల నీటినే మధ్యాహ్న భోజనానికి కూడా వినియోగించుకుంటున్నారు. నీరు సరిపోక పాఠశాలల సమీపంలోని ఇళ్లను ఆశ్రయించాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖాళీలు అత్యధికం..

శ్రీశైలం నియోజకవర్గంలో 236 పాఠశాలల్లో 36,028 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి 690 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. కాగా దాదాపు 62 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆత్మకూరు మండలంలో 12, శ్రీశైలం 4, వెలుగోడు 18, మహానంది 11, బండిఆత్మకూరు మండలంలో 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో విద్యార్థులకు బోధన కుంటుపడుతోంది. డీఎస్సీ ద్వారా ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించినప్పటికీ కేవలం నామమాత్రంగా నోటిఫికేషన్ జారీ చేసి కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు ఉపాధ్యాయ సంఘాల నుంచి వినిపిస్తున్నాయి.

ఏకోపాధ్యాయుడితో సాగని బోధన

ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆత్మకూరు మండలంలో 14, వెలుగోడు మండలంలో 8, బండిఆత్మకూరు మండలంలో 9, శ్రీశైలంలో 2, మహానంది మండలంలో 6 పాఠశాలల్లో ఒక్కో ఉపాధ్యాయుడే పని చేస్తుండటంతో ఆయా పాఠశాలల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. 1 నుంచి 3వ తరగతులకు ఎలా బోధించాలని ఉపాధ్యాయులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా అత్యవసర సమయాల్లో సెలవు పెట్టాలన్నా ఇబ్బందేనని ఏకోపాధ్యాయులు వాపోతున్నారు.



గాజులపల్లె పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న ఏకోపాధ్యాయుడు

శ్రీశైలం నియోజకవర్గంలోని ఉపాధ్యాయులు

మండలం	పనిచేస్తున్న టీచర్లు	ఖాళీ పోస్టులు	ఏకోపాధ్యాయ పాఠశాలలు
ఆత్మకూరు	225	18	12
శ్రీశైలం	22	04	0
బండిఆత్మకూరు	110	18	06
మహానంది	61	11	09
వెలుగోడు	196	08	02

నందికొట్కూరు నియోజకవర్గంలోని ఉపాధ్యాయులు

మండలం	పనిచేస్తున్న టీచర్లు	ఖాళీ పోస్టులు	ఏకోపాధ్యాయ పాఠశాలలు
నందికొట్కూరు	248	32	03
కొత్తపల్లి	160	26	04
జూపాడుబంగ్లా	171	25	06
పాములపాడు	149	20	13
పగిడ్యాల	160	14	06
మిడుతూరు	196	24	02
మొత్తం	1, 084	141	34

కనిపించని రాగి జావా..

గత ప్రభుత్వం విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతోపాటు చిక్కీలు, రాగిజావా అందించేవారు. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం వాటికి మంగళం పాడింది. పలు పాఠశాలల్లో ఒకటి లేదా రెండు రోజుల్లో మాత్రమే కోడిగుడ్లను అందిస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన కోడిగుడ్లు కూడా సరఫరా గాకపోవడంతో అప్పుడప్పుడు కోడిగుడ్ల నిర్వాహకులు చెడిపోయిన కోడిగుడ్లను ఇస్తుండడంతోవాటిని విద్యార్థులు పారేస్తున్నారు. మధ్యాహ్న భోజనంలో కూడా నాణ్యత లోపించిందనే విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

నందికొట్కూరు నియోజకవర్గంలో 265 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. గవర్నమెంట్ హైస్కూల్-2, జెడ్పీ హైస్కూల్స్-32, యూపీ స్కూల్స్-31, ప్రైమరీ స్కూల్182, ఐటీడీఏ-2, అంబేడ్కర్ గురుకులం-2, మోడల్ స్కూల్స్-4, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు-5 ఉన్నాయి. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నత విద్యకు బంగారు బాటలు వేసింది. నియోజకవర్గంలో 265 ప్రభుత్వ పాఠశాలలో 39, 831 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 141 ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.



ఇంటి నుంచి క్యారియర్ తెచ్చుకుని తింటున్న పగిడ్యాల జెడ్పీ స్కూల్ విద్యార్థినులు

శ్రీశైలం నియోజకవర్గంలోని పాఠశాలలు, విద్యా కానుక వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	విద్యాకానుక కిట్లు
ఆత్మకూరు	33	13041	90 శాతం ఇచ్చారు
వెలుగోడు	31	7628	90 శాతం ఇచ్చారు
మహానంది	44	4925	90 శాతం ఇచ్చారు
బండిఆత్మకూరు	29	5781	90 శాతం ఇచ్చారు
శ్రీశైలం	14	6462	90శాతం ఇచ్చారు
మొత్తం	151	37,837	

నందికొట్కూరు నియోజకవర్గంలోని పాఠశాలలు, విద్యా కానుక వివరాలు

మండలం	విద్యార్థులు	పాఠశాలలు	విద్యా కానుక కిట్లు
నందికొట్కూరు	18, 608	59	18, 608
కొత్తపల్లి	3, 142	42	3, 142
జూపాడుబంగ్లా	4, 048	38	4, 048
పాములపాడు	4, 100	48	4, 100
పగిడ్యాల	3, 289	29	3, 173
మిడుతూరు	3, 930	49	4, 656
మొత్తం	39, 831	265	39, 715

ఇంటి నుంచే నీళ్లు తెచ్చుకున్నా



మా పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్ వారం క్రితం చెడిపోయింది. పట్టించుకునే వాళ్లేలేరు. ఇంటి నుంచే వాటర్ తెచ్చుకుంటున్నా. మధ్యాహ్న భోజనానికి కూడా ఇవే తాగుతున్నాం. సాయంత్రం వరకు సరిపోవడం లేదు. అధికారులు స్పందించి మినరల్ వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించాలి.

- మల్లికార్జున, 8వ తరగతి విద్యార్థి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆత్మకూరు

ఆరుబయటే భోజనం



పాఠశాల బయటే, చెట్ల కింద కూర్చొని భోజనం చేస్తున్నాం. మా పాఠశాలలో భోజనం చేసేందుకు ప్రత్యేక వసతి లేదు. వర్షం వస్తే తరగతి గదుల్లోనే భోజనం చేయాల్సి వస్తోంది. బయట తినేటప్పుడు ఒక్కోసారి చెత్తచెదారం పడుతుంది. భోజనం కూడా ఒక్కోసారి సరిగా ఉండదు.

- చార్లెస్, జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి, వెలుగోడు

ఒకే ఉపాధ్యాయుడు ఉన్నాడు



మా పాఠశాలలో ఒకే ఉపాధ్యాయుడు ఉన్నారు. కొంతసేపు కొంతమంది విద్యార్థులకు, మరికొంత సేపు ఇంకొంత మంది విద్యార్థులకు చదువు చెబుతాడు. మరో ఉపాధ్యాయుడిని నియమించి, మాకు మంచి చదువు చెప్పించాలి.

- బాషా, విద్యార్థి, ఆత్మకూరు

లోపించిన పారిశుద్ధ్యం



మా పాఠశాలలో పరిసరాలు సరిగా లేవు. అధికారులు స్పందించి మాకు సరైన వసతులు కల్పించాలి. ఆట స్థలం కూడా లేకపోవడంతో ఎలాంటి క్రీడలు ఆడుకోవడం లేదు. పరిసరాలు కూడా పరిశుభ్రంగా లేవు. ఒక్కోసారి చెత్తాచెదారంలోనే కొంత సేపు ఆడుకుంటాం.

- హర్షవర్ధన్, గోపవరం, విద్యార్థి, మహానంది మండలం

విద్యా ప్రమాణాలు పెంచాలి



మిడుతూరు: ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేసి విద్యాప్రమాణాలు పెంచాలి. మా పాఠశాలలో 60 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఒక ఉపాధ్యాయురాలు పనిచేస్తుంది. ఉపాధ్యాయుల కొరత వల్ల విద్యా ప్రమాణాలు పడిపోతాయి. ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ఒక ఉపాధ్యాయురాలు బోధన కష్టతరమౌతుంది. ఐదు తరగతులకు ఐదు మంది ఉపాధ్యాయులు ఉంటే బోధన సులభతరం.

- కె.స్వాములు, రోళ్లపాడు

భయం..భయం

- హత్య నేపథ్యంలో విధులకు రావాలంటే భయపడుతున్న ఉద్యోగులు



నిర్మానుష్యంగా ఉన్న సీతారామపురం

మహానంది: సీతారామపురం గ్రామంలో వైఎస్సార్ సీపీ నేత సుబ్బరాయుడు హత్యతో స్థానికంగా నివాసం ఉంటున్న వారితో పాటు ప్రభుత్వ ఉద్యోగులు సైతం భయపడిపోతున్నారు. సోమవారం గ్రామ సచివాలయం వెనుక ఉన్న విలేజ్ హెల్త్‌క్లినిక్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగిని మధ్యాహ్నం వరకు విధులు నిర్వహించి సంబంధిత తిమ్మాపురం ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ భగవాన్ దాస్ అనుమతి తీసుకుని ముందే వెళ్లారు. గ్రామంలోకి ప్రవేశించగానే సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు ఉన్నాయి. దీంతో విధులకు రావాలంటే ఉద్యోగులు జంకుతున్నారు. హోటళ్ల నిర్వాహకులు కూడా కొద్దిసేపు ఉండి అనంతరం తమ దుకాణాలను మూసేసి వెళ్తున్నారు. గ్రామంలోకి వచ్చే కొత్తవారి వివరాలు పోలీసులు ఆరా తీస్తుండటంతో ఇదే గ్రామం మీదుగా వెళ్లే మసీదుపురం, తదితర గ్రామాల వారు ఇబ్బందులు పడుతున్నారు.

బాధితులకు న్యాయం చేస్తాం

సీతారామపురంలో హత్యకు గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సుబ్బరాయుడు కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని కడప డీఎస్పీ రమాకాంత్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం ఆయన గ్రామానికి చేరుకుని మృతుడు సుబ్బరాయుడు భార్య బాలసుబ్బమ్మ, కుమారులు జమాలయ్య, నాగప్రసాద్‌లతో మాట్లాడి వివరాలు సేకరించారు. గ్రామానికి చెందిన జయనారపురెడ్డి, పల్లవు శేఖర్‌లతో పలు అంశాలపై చర్చించారు. మహానంది, బండిఆత్మకూరు ఎస్ఐలు నాగేంద్రప్రసాద్, మల్లికార్జునతో పాటు పలు ప్రాంతాలకు చెందిన సీఐలు, ఎస్ఐలు బందోబస్తులో ఉన్నారు.

సంక్షిప్తం

పంట నమోదు తప్పనిసరి

ఆత్మకూరు: కురుకుంద, శ్రీపతిరావుపేట గ్రామాల పరిధిలో వ్యవసాయ సిబ్బంది నమోదు చేస్తున్న పంటల నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ప్రతి రైతు తప్పనిసరిగా పంటలు నమోదు చేయించుకోవాలని సూచించారు.

వెలుగోడు: మోతుకూరు, వెలుగోడు గ్రామాల పరిధిలో కొనసాగుతున్న ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని ఏఓ పవన్‌కుమార్ సోమవారం పరిశీలించి పలు సూచనలు చేశారు.

భూములు చూపండి

నందికొట్కూరు: పాములపాడు మండలం మిట్టకందాల గ్రామానికి చెందిన ఎస్సీలకు 1983లో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన భూములను ఇంత వరకు అధికారులు చూపడం లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ స్వాములు, నాయకులు ప్రతాప్, శేషన్న, పుల్లంరాజు సోమవారం ఎమ్మెల్యే జయసూర్యకు విన్నవించారు. తమరైనా స్పందించి భూములు ఎక్కడ ఉన్నాయో చూపేలా అధికారులను ఆదేశించాలని కోరారు.

న్యాయవాదిపై అక్రమ కేసు తగదు

నందికొట్కూరు: తెలంగాణ రాష్ట్రం అలంపూర్ పోలీసులు సివిల్ వివాదంలో నందికొట్కూరు న్యాయవాది గొల్ల శశిధర్‌పై అక్రమంగా కేసు బనాయించి అరెస్టు చేయడం దుర్మార్గమని బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరాముడు ఖండించారు. సోమవారం కోర్టు ఎదుట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ సెక్రటరీ వెంకటరమణ, న్యాయవాదులు శబరయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించి వెయ్యి దీపాలను వెలిగించి పూజాదికాలు నిర్వహించారు.

ఆదుకోవాలి

ఆత్మకూరు: వరదలతో మృతిచెందిన వయనాడ్ బాధితులను ఆదుకోవాలని, జరిగిన విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఎం సీనియర్ నాయకులు ఎ.రాజశేఖర్, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్‌లు డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణకు శ్రీకారం చుట్టారు.

అంతర్గత బదిలీలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో పలువురు ఉద్యోగులను అంతర్గత బదిలీ చేస్తూ దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే కేటాయించిన విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మహానందిలో శ్రావణ సందడి

మహానంది: శ్రావణమాసం సందర్భంగా మహానందిలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు.

పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మహానంది: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఓడీఎఫ్ ప్లస్ రీ వెరిఫికేషన్ టీం అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్ తెలిపారు. బండిఆత్మకూరు మండలం జీసీ పాలెంలో సోమవారం అధికారులు, సిబ్బందితో కలిసి గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు, టాయిలెట్లు, సీసీ డ్రైయిన్స్, అంగన్ వాడీ కేంద్రాల వద్ద ఉన్న పరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ విజయరావు ఉన్నారు.

సీపీఐ నాయకుల నిరసన

మహానంది: అబ్బీపురంలోని గిరిజన కాలనీలో మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారంటూ సోమవారం సీపీఐ నాయకులు ఎంపీడీఓ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆందోళన

మహానంది: వ్యవసాయానికి అర్ధరాత్రి 12 గంటలకు కరెంట్ సరఫరా ఇవ్వడాన్ని నిరసిస్తూ గుండంపాడు గ్రామానికి చెందిన రైతులు మాధవరెడ్డి, శివరాం తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం గాజులపల్లె సబ్‌స్టేషన్ వద్ద కాసేపు నిరసన చేపట్టి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

మహానందిలో జబర్దస్త్ నటి

మహానంది: మహానందీశ్వరుడి దర్శనార్థం జబర్దస్త్ నటి సాయిలేఖ సోమవారం మహానందికి మిత్రులతో కలిసి వచ్చారు. మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. వారి వెంట అర్చకులు కంపమల్ల రోహిత్ శర్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ఆత్మకూరు: బైర్లూటీ పీహెచ్‌సీ పరిధిలోని కల్వకాలువ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కంటి వైద్యనిపుణులు షేక్షావలి, సీహెచ్‌ఓ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూములు ఇప్పించండి

నందికొట్కూరు: ఆక్రమణకు గురైన తమ భూములను తమకు ఇప్పించాలని దామగట్ల గ్రామ రైతు రంగముని సోమవారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసనకు దిగాడు. రెవెన్యూ అధికారులు న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యమని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

అండర్ బ్రిడ్జి నిర్మించాలి

ఆత్మకూరు: కేజీ రోడ్డు నుంచి చరకా కాలనీకి వెళ్లే మార్గంలో అండర్ బ్రిడ్జి నిర్మించాలని సీపీఎం నాయకులు ఎ.రణధీర్, చందావారి వెంకటేశ్వర్లు, పి.సుధాకర్ తదితరులు తహసీల్దార్ రత్నరాధికను కలిసి వినతి పత్రం అందజేశారు.

రైతులకు అవగాహన

పగిడ్యాల: ప్రకృతి వ్యవసాయంపై నందికొట్కూరు డివిజన్ ఇన్‌చార్జ్‌లు అయ్యస్వామి, రవీంద్రనాథ్ రైతులకు అవగాహన కల్పించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించారు.



నందికొట్కూరు తహసీల్దార్‌కు శ్రీనివాసులుకు బొకే అందజేస్తున్న డీటీలు, సిబ్బంది

బాధ్యతల స్వీకరణ

సాక్షి నెట్‌వర్క్: నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లోని పలు మండలాల తహసీల్దార్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సమయంలో ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్లు జిల్లాలకు వెళ్లిన విషయం విదితమే. అయితే ఇటీవల సొంత జిల్లాలకు వచ్చిన తహసీల్దార్లను జిల్లా ఉన్నతాధికారులు మండలాలకు కేటాయించడంతో వారు బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్లకు ఆయా మండలాల డిప్యూటీ తహసీల్దార్లు, సిబ్బంది పూల బొకేలు అందజేసి స్వాగతం తెలిపారు.



ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధికకు శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ అధికారులు





జూపాడుబంగ్లా, వెలుగోడు తహసీల్దార్లు చంద్రశేఖర్‌నాయక్, శ్రీనివాసగౌడు





కొత్తపల్లి, మిడుతూరు తహసీల్దార్లు ఉమారాణి, టి.శ్రీనివాసులు

ఆత్మకూరు డీఎస్పీగా రామాంజి నాయక్

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు డీఎస్పీగా రామాంజి నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు సీఐలు, ఎస్ఐలు పుష్పగుచ్ఛాలు అందించి ఆహ్వానం పలికారు. సబ్‌డివిజన్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రామాంజి నాయక్ తెలిపారు.

శ్రీశైలం తహసీల్దార్‌గా శ్రీనివాసులు



శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక తహసీల్దార్‌గా కె.వి.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి తహసీల్దార్ గుర్రప్ప కడప జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులును నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో బాధ్యతలు చేపట్టారు.

ఆటో డ్రైవర్‌కు జైలు

మిడుతూరు: రోళ్లపాడుకు చెందిన ఆటో డ్రైవర్ ఈడిగ మనోహర్ గౌడ్ 2016 మార్చి 28న అజాగ్రత్తగా ఆటో నడపడంతో అలగనూరు గ్రామానికి చెందిన వెంకటస్వామి మృతి చెందాడు. ఈ కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ నందికొట్కూరు జేఎస్‌సీఎం కోర్టు జడ్జి దివ్య సోమవారం తీర్పు చెప్పినట్లు మిడుతూరు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు.

మిడుతూరు: తలముడిపి గ్రామానికి చెందిన ఓ మహిళ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి అసభ్య పదజాలంతో దూషించిన అదే గ్రామానికి చెందిన తెలుగు శ్రీనివాసులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ సోమవారం తెలిపారు.

హుండీ చోరీ

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు గ్రామంలో ఉన్న సాయిబాబా ఆలయ హుండీని గుర్తు తెలియ ని దుండగులు చోరీ చేశారు. నాగులు నెలలుగా భక్తులు సమర్పించిన కానుకలు చోరీకి గురికావడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

ఆత్మకూరు: సిద్దాపురం, సిద్ధపల్లి గ్రామాల పరిసరాల్లో దాడులు నిర్వహించినట్లు సెబ్ సీఐ మారుతిరావు సోమవారం తెలిపారు. 1,100 లీటర్ల బెల్లం ఊట, 20 లీటర్లు సారా ధ్వంసం చేసి, రెండు కేసులు నమోదు చేశామన్నారు.

విద్యుత్ కాపర్ వైర్ల చోరీ

మహానంది: బొల్లవరం గ్రామ పరిధిలోని పంట పొలాల్లో ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్ల కాపర్ తీగలు చోరీకి గురైనట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.